వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలి

● ప్రొఫెసర్ డాక్టర్ మతిన్ అహ్మద్

పాలకుర్తి/పాలకుర్తిటౌన్/దేవరుప్పుల/కొడకండ్ల: ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఉపాధ్యాయుల సూచనల మేరకు ప్రణాళికబద్ధంగా వార్షిక పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ మతిన్ అహ్మద్ సూచించారు. మంగళవారం పాలకుర్తి, దేవరుప్పుల(మున్‌పహాడ్), కొడకండ్ల (మొండ్రాయి) మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం కొత్తగా వచ్చిన ఆరు ప్రశ్నాపత్రాలపై పూర్తిస్థాయి అవగాహన పొందాలని సూచించారు. అంతేకాకుండా పంచ సూత్రాల ఆధారంగా ప్రతి విద్యార్థి పదో తరగతిలో ఎక్కువ మార్కులను సాధించేలా వివిధ సబ్జెక్టుల్లో ఉదాహరిస్తూ మార్గనిర్దేశం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్పీలు నిమ్మ జయపాల్ రెడ్డి, కట్ల కోటి, సముద్రాల శేషు పాల్గొన్నారు.



పాలకుర్తి పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ మతిన్ అహ్మద్

సర్వేలకే పరిమితం చేయొద్దు



దేవరుప్పుల: మున్‌పహాడ్‌లో వరిపంట నష్టాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణనాయక్

దేవరుప్పుల: అకాల వర్షాలు, వడగళ్లతో నష్టపోయిన అన్నదాతలకు పంట నష్ట పరిహారం ఇచ్చే విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వేలకే పరిమితం చేయొద్దని టీపీసీసీ సభ్యులు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ హితవు పలికారు. మంగళవారం మండలంలోని మున్‌పహాడ్‌లో వడగళ్లతో పంట నష్టపోయిన రైతుల పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో పంట నష్టం జరిగితే రైతులకు పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. పంట నష్టం సర్వే మేరకు సత్వరమే ఎకరానికి రూ.15 వేల చొప్పున అందజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, ఎంపీటీసీ మహ్మద్ జాకీర్ హుస్సేన్, మండల నాయకులు పారుపెల్లి శ్రీనివాస్, భూక్యా సజ్జన్, షబ్బీర్, యాకన్న, మాజీ సర్పంచ్ వెంకన్న,నాగార్జున్, రెడ్డిరాజుల రమేష్, మాసంపల్లి మహేందర్, మండల యూత్ అధ్యక్షుడు యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

జఫర్‌గఢ్: ఇటీవల కురిసిన వడగళ్ల వర్షం మూలంగా పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కూనూర్, ఉప్పుగల్లు, తిమ్మంపేట, రేగడితండా, టీబీతండాల్లో వడగళ్లతో దెబ్బతిన్న పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య, బుల్లె దూడయ్య, యాదగిరి, యాట సారయ్య, బానోత్ జాను పాల్గొన్నారు.

‘దిగజారుడు రాజకీయాలు సరికాదు ’

స్టేషన్‌ఘన్‌పూర్: సీనియర్ రాజకీయ నాయకుడిగా పేరున్న బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ప్రస్తుతం దిగజారుడు రాజకీయాలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ మండిపడ్డారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో కడియం శ్రీహరి తన స్థాయిని మరిచి ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కడియం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే శివునిపల్లికి చెందిన బీజేపీ దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రడపాక ప్రదీప్ శ్రీహరికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్నారు. దీనిని రాద్ధాంతం చేస్తూ శ్రీహరి అనుచరులు బీఆర్ఎస్ నాయకులతో పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రదీప్‌పై కేసులు పెడితే సహించేది లేదని, కడియం శ్రీహరిని నియోజకవర్గంలో తిరగనివ్వమని ఆయన హెచ్చరించారు. నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా నాయకులు గుగులోతు మధు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్నల్ మాచర్ల భిక్షపతి అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు నీల లింగం అధ్యక్షతన ముదిరాజ్ ముఖ్య నాయకుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌లు న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాలన్నారు. ముదిరాజ్ మహాసభ నాయకులు కట్ల సదానందం, చిక్కుడు రాములు, పిట్టల సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ భిక్షపతి

కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్న ‘కొమ్మూరి’



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

జనగామ: కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పార్టీ కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు ఇప్పటివరకు 50 గ్రామాలకు పైగా హాథ్ సే హాథ్ జోడో యాత్ర పూర్తి చేసినట్లు చెప్పారు. టీపీసీసీ డెలిగేట్స్‌గా పొన్నాల లక్ష్మయ్యను నియమిస్తే, కొమ్మూరి మాత్రం తానే పీసీసీ మెంబర్ అని చెప్పుకోవడం ఏంటన్నారు. దీంతో పార్టీలో తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయన్నారు. ఇక నుంచి పీసీసీ మెంబర్‌గా చెప్పుకుని ప్రచారం చేస్తే అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసాన్‌పల్లి లింగాజీ, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, మండల అధ్యక్షులె కొన్నె మహేందర్‌రెడ్డి, ప్రవీణ్, కృష్ణ, ఎండి మాజీద్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ సతీష్ ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఏబీవీపీ నాయకులు

జనగామ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ ప్రగతి భవనం ముట్టడి నేపథ్యంలో జనగామ ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులు మంగళవారం హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రగతి భవన్ ముట్టడికి వెళ్తున్న క్రమంలో తమను అరెస్ట్ చేశారని ఏబీవీపీ నాయకులు చింతకింది సంతోష్ తోట హృతిక్, సాయి, పగిడిపల్లి కార్తీక్, హర్షవర్ధన్ తెలిపారు.

చర్య తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో కుంటకట్ట సమీపాన అక్రమంగా తాటి, ఈత చెట్లను నరికిన వారిపై చట్టపరంగా చర్య తీసుకోవాలని శివునిపల్లి గీత పారిశ్రామిక సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఎక్సైజ్ ఎస్సై జలీలుద్దీన్‌కు వారు మంగళవారం ఫిర్యాదు చేశారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలే పునాది

బచ్చన్నపేట: గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలే పునాది అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొన్నె గ్రామంలో బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సోమనర్సింహారెడ్డి మృతి తీరని లోటు

దేవరుప్పుల: బీజేపీ సీనియర్ నాయకుడు లేగ సోమనర్సింహారెడ్డి అకాల మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి అన్నారు. మంగళవారం నీర్మాలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లేగ సోమనర్సింహారెడ్డి అంతిమయాత్రలో బీజేపీ తదితర పార్టీ శ్రేణులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

‘అప్పారి’ సేవలు మరువలేనివి



జనగామ: ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం తన ఉద్యోగాన్ని సైతం వదులుకున్న అప్పారి వెంకటస్వామి సేవలు మరువలేనివని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ పాఠశాలలో మంగళవారం సంఘ వ్యవస్థాపక కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. అనంతరం సంఘ ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ జిల్లా కార్యదర్శి మదూరి వెంకటేష్, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, నవీన్, నర్సింహులు. నాగరాజు ఉన్నారు.

పరిహారం ఇప్పించాలి



బచ్చన్నపేట: మండలంలోని కొన్నెలో బీడీ కార్మికులకు ఇచ్చిన ప్లాట్ల భూమి నుంచి దేవాదుల ఓపెన్ కాల్వ వెళ్లగా అట్టి భూమికి పరిహారం ఇప్పించాలని బీడీ కార్మికులు కోరారు. మంగళవారం పలువురు కార్మికులు మాట్లాడారు. అధికారులు తమకు న్యాయబద్ధంగా రావాల్సిన పరిహారం డబ్బులు ఇప్పించాలని అన్నారు. విజయలక్ష్మి, శ్యామల, నర్సమ్మ, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీని బలోపేతం చేయాలి



వైఎస్సార్‌టీపీలో చేరుతున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: వైఎస్సార్‌టీపీ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గొరబోయిన సమ్మయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సంగాల ఈర్మియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమ్మయ్య సమక్షంలో వివిధ పార్టీల నుంచి నాయకులు వైఎస్సార్‌టీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు ఊరడి శ్రీనివాస్, రఘునాథపల్లి మండల అధ్యక్షుడు మునిపట్ల నరేష్, అర్జున్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

‘రాజ్యాంగాన్ని రక్షించుకుందాం’



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

జనగామ: ఆర్‌ఎస్‌ఎస్ మనువాదులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టి, మనువాదాన్ని మట్టిలో పాతిపెట్టాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన జిల్లా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మధ్యయుగాల కాలం నాటి మనుస్మృతిని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రాచీన రాజ్యాంగమంటూ ప్రకటించడాన్ని ప్రతీ ఒక్కరు ఖండించాలన్నారు. ఆకుల శ్రీనివాస్, మంగళపల్లి జనార్దన్, జువారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం 5ఈ చాంపియన్ ప్రొఫైల్ సంస్థ ఆధ్వర్యంలో రఘునాథపల్లి, కోమళ్ల, ఖిలాషాపూర్‌కు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు సబ్‌స్టేషన్ సందర్శించారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చిల్పూరు: సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తీగలతండా పంచాయతీ పరిధిలోని వాచ్యతండాకు చెందిన సీతారాం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. కాగా, చికిత్స నిమిత్తం సీఎం ఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 65వేల చెక్కును ఆయన మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఫిర్యాదు

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్సీ కడియం శ్రీహరిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తీసిన వీడియోను సోషల్ మీడియాలో పెట్టిన బీజేపీ దళితమోర్చా జిల్లా నాయకుడు రడపాక ప్రదీప్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కడియం యువసేన, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కడియం యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నాగరాజు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ప్రభాకర్ మాట్లాడారు. రజాక్‌యాదవ్, రాములు, ఫాతికుమార్, బి.రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

చిల్పూరు: లింగంపల్లి జీపీ పరిధిలోని కొమ్ముగుట్ట సమీపంలో మంగళవారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలుకాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. వేలేరు మండలం మద్దెలగూడెం మాజీ సర్పంచ్ మినుకూరు మధు పని నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం లింగంపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. కాగా, మధు తిరిగి వస్తుండగా కొమ్ముగుట్ట సమీపంలో శ్రీపతిపల్లికి చెందిన బర్మ రవి ద్విచక్రవాహనం అదుపుతప్పి ఎదురుగా వచ్చి ఢీకొనడంతో మధుకు కాలు విరుగగా రవికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిల్పూరు: ధర్మసాగర్ మండలం రాంపూర్ సమీపం ఔటర్ రింగ్‌రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిల్పూరు మండలం చిన్నపెండ్యాలకు చెందిన రామగుండం ఉదయ్ (17) మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన రామగుండం శ్రీనివాస్–రమలకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు హైదరాబాద్‌లో పని చేస్తుండగా ఉదయ్ హనుమకొండలో ఇంటర్ చదువుతున్నాడు. సోమవారం ధర్మసాగర్ మండలంలో ఓవిందుకు ఉదయ్ తంగలపల్లి అఖిల్‌తో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా ఔటర్‌రింగ్ రోడ్డుపై నిలిపి ఉన్న మినీవ్యాన్‌ను ఢీకొనడంతో ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందగా, అఖిల్‌కు కాలు విరిగింది. కాగా, ఎమ్మెల్యే రాజయ్య తదితరులు మృతుడి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి సంతాపం తెలిపారు.

కేసు నమోదు

జఫర్‌గఢ్: సీసీ రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జఫర్‌గఢ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకొని లారీ అద్దాలు పగులగొట్టి, మండల కోఆప్షన్ సభ్యుడు నజీర్, అతని భార్య, తల్లిని గాయపర్చిన తాడెం కుమారస్వామి, అతని ఇద్దరు కుమారులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

సేంద్రియ సాగు లాభదాయకం

రఘునాథపల్లి: సేంద్రియ సాగు ఎంతో లాభదాయకమని కంచనపల్లి సర్పంచ్ గవ్వాని విజయనాగేశ్వర్ అన్నారు. మంగళవారం గ్రామంలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ జీవవైవిధ్యంపై ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులతో కాకుండా సేంద్రియ సాగుపై రైతులు మొగ్గు చూపాలని కోరారు.

పంట నష్టంపై అంచనా..

తరిగొప్పుల: అకాల వర్షాల కారణంగా మండలకేంద్రం పరిధిలో దెబ్బతిన్న పంటలను వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి కన్నయ్య మండల కేంద్రం క్లస్టర్ పరిధిలో పర్యటించి దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేశారు.

ఆర్థికసాయం



జనగామ: జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన గీతకార్మికుడు మోడెపు రాజు ఇటీవల తాడిచెట్టుపైనుంచి పడి మృతి చెందాడు. కాగా, కారంకి ఫౌండేషన్, గాడ్స్ అండ్ గాడ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యాన దాతల నుంచి సేకరించిన రూ.10వేలను మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

తీగారంలో..

జఫర్‌గఢ్: తీగారంలో ఇటీవల అనారోగ్యంతో కలకోట నిశాంత్ మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రూ.15 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

లింగాలఘణపురం: మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి కరుణాకర్ ఆధ్వర్యంలో మంగళవారం జనచైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. శేఖర్, దేవదానం, శంకరయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 35,641

చిల్పూరు: ఇటీవల ఎల్లమ్మ ఉత్సవాలు నిర్వహించగా హుండీ ద్వారా రూ. 35,641 ఆదాయం వచ్చిందని చిల్పూరుగుట్ట శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ అధ్యక్షుడు నారగోని రాజు, ఉపాధ్యక్షుడు సట్ల లింగయ్య తెలిపారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు చేపట్టారు. పంతం రాజు, మాచర్ల స్వామి, వెంకట్రాం, సట్ల కొంరయ్య పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతి

దేవరుప్పుల: ప్రజోపయోగ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులు దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గండిపెల్లి యాకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ధర్మాపురం ప్రాథమిక పాఠశాల పక్కన ఓ వ్యక్తి స్మారక స్థూపం నిర్మించే విషయమై ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవ్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. దౌపాటి రవి, వెంకన్న ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

బచ్చన్నపేట: ప్రతి విద్యార్థి ఇష్టపడి చదువుతూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి కొండల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను వన దర్శినికి మండలంలోని మన్సాన్‌పల్లిలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. అడవిలో ఉండే చెట్లు, గుట్టలు, పలు లోయల గురించి విద్యార్థులకు వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

బచ్చన్నపేట: యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ పలువురికి ఈ అంశాలపై అవగాహన కల్పించాలని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే మాట్లాడొద్దని సూచించారు. సెకండ్ ఎస్సై స్వజన్‌కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పాలకుర్తి టౌన్: ఆర్థిక శాఖ పరిధిలోని ఈ కుబేరులో నెలల తరబడి పెండింగ్‌లోని బిల్లులను సత్వరమే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు.